# శైత్యాంతం

**ధ్యానం** ముగించుకుని హాల్లోకి వచ్చిందామె. శీతువు కౌగిట్లో సూర్యుడు జోగుతూనే ఉన్నాడు. ఆరు దాటింది. బయటింకా చీకటిగానే ఉంది. జుట్టు ముడివేసుకుని వంటగ్గదిలోకి వెళ్లికాఫీ చేసుకుందామె. కప్పు తీసుకుని హాల్లో టీపాయి మీద పెట్టుకుని ముందు గడి తలుపు తీసింది. తలుపు గడియ వెనక పత్రిక కుక్కి ఉంది. సోఫాలో సుఖంగా ఒదిగి ఒళ్లో పేపరు పరుచుకుని కాఫీ కప్పు అందుకుందామె. రెండు పడగ్గదుల ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. టీవీ, సోఫా, పక్కగా హాలుకు అడుగు ఎత్తుగా భోజనాల బల్ల. నాలుగుకుర్చీలూ అన్నీ నిర్మలంగా శుభ్రంగా మానవ స్పర్శ తగలనంత తాజాగా ఉన్నాయి. ఒక పడగ్గదిలో మంచం, బీరువా వగైరాలు. మొత్తానికి ఇల్లంతా సామాన్లు నింపలేకపోయిన వైశాల్యం. చుట్టూ వ్యాపించిన శీతవులో వేడి కాఫీ ప్రాణానికి హాయిగా ఉంది. కప్పు ఖాళీ అవగానే సుఖం హరించుకుపోయింది. అంటే ఏ సుఖమైనా అంతే నన్నమాట. ఒక్క దుఃఖమే నిజం. చావు నిజం. అందుకే నిరంతరం మృత్యుస్పృహతో జీవించమన్నాడు బుద్ధుడు. పేపరు మీది అక్షరాలు బొమ్మలు కలిసి ఆమెకి అర్థవంతమైన సమాచారం ఏదీ ఇవ్వడం లేదు. కళ్లు మూసుకుందామె. అరగంటపైగా చేసిన ధ్యానం తరవాత కూడా ఆమె ఆలోచనలు ఒకే ఆవరణంలో ఉన్నాయి.

ఏడుగంటలకి పనిమనిషి పార్వతి వస్తుంది. మూడున్నర గిన్నెలూ కఫీకప్పూ నాలుగు నిమిషాల్లో తోముతుంది. చేతులు మళ్లీ శుభ్రంగా కడుక్కుని ఉల్లిపాయలు పచ్చి మిరపకాయలు ఉప్మా కోసం తరుగుతుంది. ఆమె లేచి వెళ్లి ఉప్మా తయారీలో ఉంటుంది. తను విడిచిన చీర వగైరాలు పార్వతి ఉతికి ఆరేస్తుంది. ఇవన్నీ చేస్తూండగా కింద మళయాళీ అమ్మ గారూ వాళ్ల ఆయనా కలిసి రాత్రి తాగుతారనీ తనకి ఖచ్చితమైన సమాచారం ఉందనీ చెప్తుంది. ఆమె వింటుంది. అనేక ప్రశ్నలు మొలకెత్తుతాయి. బాల్కనీలో బట్టలు ఆరేసి అప్పటికే శుభ్రంగా ఉన్న గదుల్ని శుభ్రంగా ఊడుస్తుంది. తనకి ప్రత్యేకించబడ్డ గాజుగ్లాసులో కాఫీ పోయించుకుని వంట ఇంటి గుమ్మం దగ్గిర చతికిలబడి 38లో అమ్మగారి 'తమ్ముడు'కీ 31లో అమ్మగారి కూతురికీ వ్యవహారం ఎలా నడుస్తోందో వివరిస్తుంది. మళ్లీ ఆమెకి ప్రశ్నలు. కాఫీ గ్లాసు కడిగి ఎర్ర ప్లాస్టిక్ బాల్చీలో నీళ్లు నింపుకుని నాలుగు చుక్కలు సువాసన ఫినాయిలు రంగరించి గదులకి తడిగుడ్డ పెడుతుంది.

ఫేను గాలికి గదిలో చెమ్మ క్రమంగా ఆవిరైపోతుంది. పార్వతి వెళ్లగానే ఆమె అన్ని గదుల్లోనూ మెల్లిగా తిరిగొస్తుంది. తన నీడ తనలో నడుస్తుంది. చాలాసార్లు తిరుగుతుందామె. పాదాల కింద ఆమె నీడ అస్పష్టంగా మరకలా ఆమెతో ఉంటుంది. సోఫాలో కూచోగానే నీడ వెళ్లిపోతుంది.

లేచి కిటికీ దగ్గిరికి వెళ్లి నుంచుందామె. లోకం తెల్లబడింది. పాలవాళ్లు లోపలికి వస్తున్నారు. రెడ్డిగారూ భార్యా ఉదయం నడక ముగించుకుని లోపలికి వస్తున్నారు. కాయగూరలవాడు సైకిల్ని లోపలికి లాక్కొస్తున్నాడు. పాలవాడు, కూరలవాడు, ఇస్త్రీవాడు, రెడ్డిగారూ, మాలతీ జోసెఫ్ అందరూ వాళ్ల కక్ష్యలో గింగిరాలు తిరుగుతూంటారన్నమాట. పిండి మరలో చక్రం మీది పట్టాలాగ నిరంతరం తిరుగుతూంటారు. కూరలవాడు చాలా దూరం నుంచి వస్తాడు. కూతురి పెళ్లి చేసి ఈ వ్యాపారం మానేస్తానన్నాడు. ("ఇంక రేస్టేనండమ్మగారు.") వాడి జీవితాన్నేం చేసుకోవాలో వాడికి స్పష్టంగా తెలిసినట్టుంది. ప్రశ్నలు, అనుమానాలు, జవాబులు, తర్కం లేవు. "గొడవొలిపోద్ది"- అంతే.

తిరిగి వెళ్లి సోఫాలో ప్రశ్నార్థకంలా పడుకుందామె. ఒక్క ఉదయం మాత్రం ఆమె ధ్యానంలో కూచుంటుంది. ఈ అపార్ట్‌మెంట్ భవనంలోకనీసం ఇరవైమందికి ఆమె ధ్యానంలో శిక్షణ ఇచ్చింది. ప్రతీనెలా మొదటి ఆదివారం వాళ్లందరూ ఆమె ఫ్లాట్‌కి వస్తారు. టీ తాగి పకోడీలు నవుల్తూ ధ్యానం, విపస్సన పద్ధతి, జిడ్డు కృష్ణమూర్తి గారి గురించీ మాట్లాడుతుందామె. తాత్త్విక విషయాల గురించి మాట్లాడ్డం, వివరించడం ఆమె కిష్టం. అస్తిత్వ వాదం గురించి కూడా ఆమె చదివిన పుస్తకాల్లో తత్వాన్ని వాళ్లకి చెప్తుందామె. ఏ పొరకాపొర విడదీసి తెలుగులో ఇంగ్లీషులో చర్చిస్తుందామె. వాళ్లు తపివి తీరా వింటారు. వాళ్లు వెళ్లగానే ఆవరించిన శూన్యంలో ఆమె సోఫాలో ఉండిపోతుంది.

కృష్ణాజీ మూడు నెలలకి వెళ్లిపోతారనగా ఆమె వసంతవిహార్‌లో ఆయన్ని కలిసింది. ఆయన ప్రసంగాలు ఎన్నో విన్నదామె. విశాలంగా ఉజ్జ్వలంగా మెరిసిపోయే ఆయన కళ్లు చూస్తూ మనోహరంగా మంద్రంగా సాగిపోయే ఆయన ప్రవచనం ఆమెకి గొప్ప ఉత్తేజం కలిగించేది. ఆ రోజు సాయంకాలం కృష్ణాజీ కిటికీ దగ్గిర కూచుని బయటికి చూస్తున్నారు. నిశ్శబ్దంగా గదిలోకి వచ్చిన ఆమె అక్కడే ఆగిపోయింది. కాలం, దారీ తప్పి కుర్తా తెల్లటి పంచలో కృష్ణమూర్తిగారిలో ఈ లోకానికి సంబంధించని ఆశ్చర్యకరమైన వెలుగూ శాంతీ కనిపించాయామెకి. పది నిముషాలు మాట్లాడిన తరవాత గుమ్మం వరకూ సాగనంపుతూ అన్నారాయన

"యూ హేవ్ టూమెనీ క్వశ్చన్స్ నిర్మలా."

"యస్. కృష్ణాజీ. ఐ రీడ్, థింక్ అండ్ ఆస్క్ క్వశ్చన్స్."

ఆమె వేపు క్షణకాలం పాటు నిశితంగాచూసి మృదువుగా నవ్వి అన్నారాయన.

"ఓహ్. బట్ నిర్మల వాట్ డు యు డు విత్ దీజ్ క్వశ్చన్స్ వన్స్ ఐ టేక్ లీవ్ ఆఫ్ దిస్ వరల్డ్? ఆర్ డు యూ థింక్ యువర్ కృష్ణాజీ ఈజ్ ఇమ్మోర్టల్?"

మూడు నెలల తరవాత పేపర్లో జె.కె. మహాపరినిర్వాణ వార్త చూసి చిన్నపిల్లలా ఏడ్చిందామె. వారంరోజుల పాటు ఆయన ఫోటో చూస్తూ రెండుజన్మలకి సరిపడా శోకాన్ని అనుభవించిందామె. సంతలో తప్పిపోయిన పిల్లలా అయిపోయింది నిర్మల. జ్ఞాపకాల్నీ, ప్రశ్నల్నీ, చలినీ బద్దలు చేస్తూ ఫోను మోగింది. ఫోనందుకుని హలో అనగానే ఆమె మనసులో పెద్ద సంతోష తరంగం ఎగిసి పడింది.

"అమ్మా, ఏం చేస్తున్నావు? నీ మెడిటేషన్ అయిందా?"

బోస్టన్ నుంచి కొడుకు మాటలు ఆమెని వెచ్చటి శాలువాలాగ కప్పేశాయి. చాలా సేపు మాట్లాడి అడిగే డతను.

"ఎప్పుడొద్దా వనుకుంటున్నావు? ఎండలు ముదిరిపోకముందే వచ్చెయ్యి."

సరేనందామె. ఫోనుపెట్టేసిన వెంటనే బట్టలు సద్దుకని బోస్టన్ వెళ్లిపోవాలనిపించింది. మళ్లీ కాసేపటికి మామూలు స్థితిలోకి వచ్చిందామె. సాయంత్రం అందరూ వస్తారు. ఏదో ఒక కొత్త విషయం వినాలని ఉంటుంది వాళ్లకి. మామూలుగా ఎపుడేనా కారిడార్లో ఎదురు పడ్డా, వాళ్ల ఇళ్లకి వెళ్లినా తప్పుకుని దారివ్వడం లేచి నుంచుని ఆమె కూచునే వరకూ నుంచోడం, ఇంటావిడా పిల్లలూ భక్తిగా తనవేపు చూస్తూ కాఫీయో మంచినీళ్లో అందించడం పరిపాటి. పిల్లల చదువుల గురించి ఎక్కువ అడుగుతుంది నిర్మల. ఏం పుస్తకాలు చదుపుతూంటారు, ఏం ఆలోచిస్తూంటారని, వాళ్లు ఏం చెయ్యదల్చుకున్నారో తెలుసుకుంటుందామె. ఎక్కువమంది పుస్తకాలు చదవరని తెలుసుకుని బాధపడిందామె. ("బుక్స్ బోర్ అజ్ టు డెత్.") కుర్రాళ్లందరికీ అపార్ట్‌మెంట్స్‌లో నిర్మలని మాతాజీ అనడం అలవాటైంది. నిర్మల ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా నలుగుర్నీ కూచోపెట్టి రమణమహర్షి గురించో తాత్త్విక జీవనం గురించో మాట్లాడ్డం అలవాటు. మాట్లాడ్డం ఆమెకి విముక్తి. భర్త కారు ప్రమాదంలో మరణించడం, గుర్తుపట్టడానికి వీల్లేని అతని శరీరభాగాల్ని కట్టిన మూటా ఆమె ఇంకా మర్చిపోలేదు. తరచుగా కలల్లో రక్తం ఓడుతున్న భర్త శరీరం కనిపిస్తూంటుంది. ఏడాది తరవాతగానీ నిర్మల మామూలు లోకంలో పడలేదు. తన చుట్టూరా నిర్జీవమైన ఎడారి పరుచుకున్నట్టనిపించింది. వాస్తవ ప్రపంచం అవాస్తవంగా అనాసక్తంగా కనిపించింది. అనుకోకుండా చెన్నైలో కృష్ణాజీ ప్రసంగం వినడం తటస్థించిం దామెకి. తన కోసమే గీతా ప్రవచనం చేస్తున్న కృష్ణుడిలా కనిపించారు కృష్ణాజీ. ఒక శూన్యాన్నీ, ఖాళీని, ఒంటరితనాన్నీ నిర్మల కృష్ణాజీ ప్రసంగాలతో, రమణ మహర్షి

పుస్తకాలతో పుస్తకాల అలమారలా అమర్చుకుంది. రిటైరయి హైదరాబాదులో ఫ్లాట్ కొనుక్కున్న తరవాత కొడుకు బోస్టన్ వెళ్లిపోయాడు. ఆమె ముందు గది అలమరల్లో తెలుగు ఇంగ్లీషు తాత్త్విక సంబంధమైన పుస్తకాలు, రమణ, బుద్ధుడు, ప్రముఖంగా కృష్ణాజీ ఖరీదైన ఫోటో గ్రాఫులు ఆకర్షణీయంగా సద్దుకుంది నిర్మల. కృష్ణాజీ ప్రసంగాల టేపులు, అపార్ట్‌మెంట్ భవనంలో తన శ్రోతలు ఆమె జీవితానికి ఇంధనాన్ని సమకూర్చిపెట్టేరు. ఆదివారం ప్రసంగాల్లో శ్రోతల వ్యక్తిగత సమస్యలు, చీకాకులు, ఆందోళనలు చెప్పుకుంటారు. నిర్మల వాటిని శాంతంగా విని చిరునవ్వుతో సమస్యల్ని దేనికది విడదీసి వివరణతో సహా సలహాలిస్తుంది. శ్రోతలకి కొంచెం ధైర్యం ఆమె అంటే ఎక్కువ గౌరవం కలుగుతాయి.

నిర్మల లేచి మరోసారి కాఫీ కప్పులో పోసుకుని పుస్తకాల గోడ దగ్గిరికి వెళ్లింది. అద్దంలో పుస్తకాల్లోంచి కనిపిస్తోందామె. ఒక పుస్తకం ఏరుకుని సోఫాలో కూచుందామె. పది నిముషాలు పుస్తకం తిరగేసి మళ్లీ టీపాయి మీద పెట్టింది. సాయంకాలం ఇవాళ ఏం మాట్లాడాలి? జీవితానికి తాత్విక దృక్పథం అవసరం. అది లేనప్పుడు జీవనం అర్థరహితంగా కనిపిస్తుంది. సమస్యలు లేని జీవితం ఉండదు. కారణాలు ఏవేనా కావొచ్చు. వీటిని అధిగమించి శాంతంగా ఎలా ఉండడం? శాంతి ఎక్కడ నుంచి ఎలా వస్తుంది? నిర్మల మాట్లాడేటపుడు కృష్ణాజీ చెప్పిన ఉదాహరణలు పోలికలు తరచుగా వస్తూంటాయి. కానీ కృష్ణాజీ చెప్పిన ఆఖరి మాట ఆమె మర్చిపోలేదు. తాత్త్విక జ్ఞానం పెరిగే కొద్దీ ఆమె జీవితం నిండా ముళ్లపొదల్లా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పార్వతి వచ్చింది. చకచక పనులన్నీ ముగించేసింది. డబ్బు లిచ్చి ఉల్లిపాయలు పురమాయించింది నిర్మల. సాయంత్రం ఏం మాట్లాడాలో ఆమెకింకా స్ఫురించలేదు. మధ్యాహ్నం భోజనం చేసిం తరవాత మళ్లీ పుస్తకాల అలమర దగ్గిర నుంచుందామె. కాలింగ్ బెల్ మోగింది. వాచ్‌మెన్ పోస్టు కవరిచ్చి వెళ్లిపోయాడు. కవరు మీద అక్షరాలు చూడగానే చెల్లెలు రత్నం 'అక్కా' అని పిలిచినట్టయింది. సోఫాలోవాలి చెల్లెలి ఉత్తరం ఇష్టంగా చదవడం మొదలుపెట్టిందామె. నిజానికామెకి ఉత్తరంలో ఏ భాగంలో ఏవుంటుందో తెలుసు. సరిగ్గా ఊహించినట్టే ఉంది. రత్నం ఉత్తరాలు బాగా రాస్తుంది. మాట్లేడప్పుడు లేని స్పష్టత ఆమె రాతలో కనిపిస్తుంది. తనకి ఉత్తరాలు రాయడం బద్ధకం అనే చెప్పాలి. ("అక్కా ఉత్తరం అందింది. నీ గురించి ఏవీ లేదందులో....") ఉత్తరం చివరి భాగం బాబాగారి గురించే రాసింది. ఆ భాగం మళ్లీ మళ్లీ చదివిందామె. ఉత్తరం దిండు కింద పెట్టింది. బాబాగారంటే చెల్లెలికి విపరీతమైన భక్తి. ఒక్కసారి ఆశ్రమానికి వచ్చి ఆయన్ని దర్శించుకోమని రెండేళ్ల నుంచీ రాస్తోందామె. లేచి వెళ్లి పుస్తకాల్లో పెట్టిన

కవర్లోంచి బాబాగారి ఫోటో తీసిందామె. తదేకంగా ఫోటో వేపు చూసిందామె. ఎంత చూసినా ఆమె అభిప్రాయం మారలేదు. మామూలు తెల్లచొక్కా, లుంగీ, కళ్లజోడు- కుర్చీలో కూచుని ఉన్నారాయన. ఆ గడ్డం, కళ్లజోడుతో పదవీ విరమణ చేసిన లెక్కల మేస్టారిలా ఉన్నాడు బాబాగారు. ఆ పోలికకి తనకే నవ్వొచ్చింది. మొదట తెలీలేదుగానీ ఓ పుస్తకంలో చూసిన తరవాత గణపతిమునికీ బాబాగారికీ చాలా పోలికలు కనిపించేయి. క్రితంసారి మరిదిగారు వచ్చినప్పుడు నాలుగు కేజీల స్వీట్లు కట్టించుకుని జాగ్రత్తగా వేరే సంచీలో పెట్టి కూచున్నాడు.

"మా బాబా గారికి."

"అన్ని స్వీట్లు తింటారా?"

"తినరు. వచ్చినవాళ్లకి ఇస్తూంటారు."

వేళ్లేముందు ఆశ్రమానికి ఒచ్చి ఎలాగైనా రెండ్రోజులుండమని మరీ మరీ చెప్పి వెళ్లే డాయన. "మీరు తప్పకుండా నాన్నగారి దర్శనం చేసుకోవాలి వదినగారూ. మీరన్ని పుస్తకాలు చదువుతారు గదా."

చనువున్నవాళ్లందరూ ఆయన్ని నాన్నగారని పిలుస్తారట. వేదాంతం గురించీ, జీవితం గురించీ ఉపన్యాసాలు చెప్పరాయన. ఆయన హైస్కూలు దాటి చదువుకోలేదు. పుస్తకాలు అసలు చదవరు. ప్రతీ సోమవారం అసంఖ్యాకంగా భక్తులు వచ్చి ఆయనకి నమస్కరించి ప్రసాదం తిని వెళ్లి పోతారు. అనేకమంది ఆయన దగ్గిర కూచుని వాళ్ల శారీరక మానసికమైన వ్యధల గురించి చెప్పుకుంటారు.

"విని ఏం చేస్తారాయన?"

'ఏవీ చెయ్యరు. ఆశీర్వదించి ధైర్యం చెప్పి పంపిస్తారు. ఏంచేస్తారో మనకి తెలీదు. మేం ఆయనమీద ప్రేమతో భక్తితో మా పని మేం చేసుకుపోతాం. ఏది ఎలా వచ్చినా ఆయనే చూసుకుంటారని మా నమ్మకం. అలాగే జరుగుతోంది."

"ఏవీ చెయ్యనపుడు నమ్మకం ఎలా కుదురుతుంది?"

"వదినగారూ, ముందు మన మీద మనకి నమ్మకం ఉండాలి. నిజానికి భగవంతుడూ, గురువూ నిత్యజీవితంలో మనకి ఎదురయ్యే సమస్యల్ని తీర్చడానికి కాదు. ఉద్యోగం రాలేదనో, డబ్బు లేదనో, కోడలికి ఇంకా కడుపురాలేదనో... దీనికి అంతే వుంది చెప్పండి? సద్గురువు జీవితాన్ని ఎట్లా చూడాలో చెప్తాడు. కాలాతీతమైన వాళ్ల ప్రజ్ఞ మన బాధల్ని నిజంగానే తీరుస్తుంది. కానీ కాలినెప్పీ, కడుపునెప్పికీ డాక్టరు దగ్గిరికే వెళ్లాలి. ఇది మనం అర్థం చేసుకోవాలి. విశ్వాసం అనేది అర్థంగాని విషయం. అది తర్కానికి అతీతమైంది."

"ఆయన పెద్దగా చదువుకోలేదటగదా?"

"అవును. చదువుకీ దీనికీ సంబంధం లేదు."

"నిజవే. కానీ...."

"బాబాగారి సన్నిధిలో మనం అనుభవించే శాంతీ, నిర్వృతి మొదలైనవి చాలా లోతైన వ్యక్తిగతమైన అనుభవాలు. ఎవరికి వారు అనుభవిస్తేనేగాని తెలీదు. అందుకే ఆధ్యాత్మిక అనుభవాల గురించి ఇతరులకి చెప్పకూడదంటారు."

"ఆయన సైకిలు మీద తిరిగేవాడటగదా?"

"అవును. పెద్దవారయిపోయారు. ఇదివరకు సైకిలు మీద తిరుగుతూ మన పనులు కూడా చేసి పెట్టేవారు. చాలా అవసరం, మరో దిక్కులేదు అనుకున్న పరిస్థితుల్లో ఆయ వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆయన ఎవర్నీ డబ్బు అడగరు. ఊళ్లో ఆశ్రమంతో సంబంధం ఉన్న కొన్నికుటుంబాలు మతం మార్చుకుని అంతవరకూ వేసే భిక్ష వెయ్యడం మానేశారు. మాకు బాధనిపించింది. అది వారిష్టం. వారిప్పుడు నమ్ముకున్న దేవుడిపట్ల భక్తిగా ఉండడం మంచిదేగా అన్నా రాయన.

సంవత్సరం తరవాత ఈ మధ్యాహ్నవేళ మరిదిగారి మాటలు గుర్తు రావడం అలా ఉంచి పక్కనేకూచుని చెప్తున్నట్టనిపించింది. బాబాగారి గురించి విన్నప్పుడల్లా ఆమెకి కృష్ణాజీ గొప్ప అందం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. ఎందుకీ గురువులు? ఏం చెయ్యగలరు? ఫోటో కూడా దిండు కిందపెట్టుకుని కళ్లు మూసుకుంది నిర్మల. రెండు నిముషాల్లో ఆమెకి తెలీకుండానే నిద్ర నీలపు లోయలోకి మెత్తగాజారిపోయింది. గడ్డం పెంచుకున్న ముసలి లెక్కల మేస్టారెవరితోనో రైల్లో ఊరెడుతున్నట్టు కలొచ్చిందామెకి.

ఈసారి అందరూ వచ్చేరు. పకోడీలు నములుతూ, మాట్లాడుకుంటూ శీతాకాలపు సంధ్యలో ఒక వెచ్చటి వలయాన్ని ఏర్పరిచేరు వాళ్లు. నిర్మల సోఫా మధ్య కూచుని చిరునవ్వుతో ప్రసంగం మొదలుపెట్టింది.

రాత్రి భోజనం అయిందనిపించి టీవీ ముందు కూచుందామె. ఎప్పటిలాగే ఎప్పటి ఆదివారం లాగే ఏదో మంత్రశక్తి దిగిపోయిన నిస్తేజం ఆమెని ఆవహించింది. పదవుతూండగా చటుక్కున లేచి ఫోనందుకుందామె. అవతలి వేపు నుంచి బోలెడు సంతోషం చెవిలో పడింది.

"అక్కా, ఏం చేస్తున్నావే?"

చాలా సేపు మాట్లాడిం తరవాత రత్నం అంది.

"చాలా రోజులైంది. ఒకసారి రారాదూ? నాలుగు రోజులుండి వెడుదువుగాని. నాన్నగారికి నీ గురించి చెప్పేను. ఎప్పుడొస్తావు?"

"ఒచ్చే నెల్లో వస్తాను. ఏవన్నారు మీ నాన్నగారు?"

"ఏవీ అనలేదు. నవ్వి, వస్తారులే అమ్మా అన్నారు."

అట్లా అనుకున్నది ఫిబ్రవరి చివరికిగాని ప్రయాణం కుదరలేదు. చెల్లెలింట్లో హాయిగా అనిపించిందామెకి. రాజమండ్రీలో అనీబిసెంట్, కృష్ణాజీ ఇద్దరూ ఉన్నారు. ఆయన ఉన్న ఇంటికి వెళ్లాలనిపించింది. మొత్తానికి మూడు రోజుల తరవాత ఓ సాయంకాలం బాబాగార్ని చూడ్డానికి బయల్దేరేరు అందరూ. ఒక పక్క పొలాలు వాటికవతల నీలపు కొండ ముద్దలు,ఒక వేపు గోదావరి. రెంటి మధ్యా అతుకుల రోడ్డు.

గదిలో కూచుని ఉన్నారాయన. ఆశ్రమం చూడగానే నీరుగారిపోయింది నిర్మల. తను ఊహించుకున్న ఆశ్రమంలా లేదు. తెల్లబనీను, తెల్ల లుంగీ, కాళ్లు నేల మీద ఆనించి మడత మంచం మీద కూచుని ఉన్నారు బాబా. ఆయనెదురుగా కింద కూచున్నారు. ముగ్గురూ. నాయన్ని పరిశీలనగా చూసింది నిర్మల. కళ్లజోళ్లోంచి చూస్తున్న కళ్లు మాత్రం ప్రశాంతంగా ఉన్నాయి.

"అబ్బాయీ కోడలూ బాగున్నారా అమ్మా?"

"బావున్నారండీ."

"మనవడికి ఎలా ఉంది?"

"పూర్తిగా కోలుకున్నాడు బాబాజీ. మామూలుగా స్కూలుకి వెళ్తున్నాట్ట. ఒచ్చేముందే వాడితో మాట్లాడేను."

అంటూ హఠాత్తుగా ఆగిపోయిందామె. మనవడికి ఆ మధ్య కల్తీ పీజా తినడం వల్ల వారం రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చింది. ఇంతవరకూ కంగారుపడుతుందని రత్నానికి కూడా తను ఈ మాటచెప్పలేదు. ఆశ్చర్యంగా బాబాగారి వేపుచూసిందామె. ఆయన ఆమె వేపే చూస్తూ అన్నారు.

"బాగానే ఉంటాడు. నువ్వేం వర్రీ అవమాకు."

ఆమె తేరుకున్న తరువాత, కృష్ణాజీ సమ్మోహనకరమైన మాటలు విన్న తరవాత బాబాగారి మాటలు, యాస వినడానికిచేదుగా ఉన్నాయి. ఆమె చేతిలో కృష్ణాజీ పుస్తకం ఉంది. కావాలని ఒళ్లో ఉన్న పుస్తకం వేపు చూసిందామె.

"ఏం బుక్కమ్మా అది?"

నవ్వుతూ రత్నం అంది.

"మీ కెందుకు నాన్నగారూ. అది ఇంగ్లీషులో ఉంది. మీకు ఇంగ్లీషు రాదుగా."

"వీడికి అన్ని భాషలూ వచ్చు."

ఆయన కూడా నవ్వుతూ పుస్తకం అందుకున్నారు. అటూ ఇటూ తిప్పి కృష్ణాజీ ముఖాన్ని పరిశీలనగా చూస్తూ ఉండిపోయారు. తలెత్తి నిర్మలని అడిగారు.

"ఎవరమ్మా ఈయన?"

నిర్మల నెత్తిమీద బిందెడు చన్నీళ్లు కుమ్మరించి నట్టయింది.

"ఆయన మా గురువు. జిడ్డు కృష్ణమూర్తిగారు. ఆయన..."

"పేరుదేవుందిలే అమ్మా. బుద్ధుడు తల్లీ ఈయన."

బుద్ధు డనగానే నిర్మలకి నోటమాట రాలేదు.

"రత్నం తల్లీ అక్కయ్యగారికి స్వీటు పెట్టండమ్మా."

రత్నం లేచి చెక్క బీరువా తెరిచి స్వీట్లడబ్బా బాబాగారి చేతికిచ్చింది. అందులోంచి ఏరి ఒక స్వీటు తీసి నిర్మల కిచ్చేరాయన. కాసేపుకూచున్న రత్నం, వాళ్లాయనా వంటశాలలో సహాయం చెయ్యడం కోపం వెళ్లిపోయారు. నిర్మలకి ఏం చెయ్యాలో ఏం మాట్లాడాలో తెలీడంలేదు. ఆయనకి తెలీని విషయాలు ప్రస్తావిస్తే అమర్యాదగా ఉంటుందని భయ వేసింది. తాత్త్విక విషయాలు ఆయనకి తెలీవని తనకి తెలుసు.

"ఆలోచిస్తా కూచుంటే ఏవీ ఉండదమ్మా. బుర్ర చెడ్డం తప్ప. అంతేనా?"

తనవేపే చూస్తూ అడుగుతున్నారాయన. చివరకి ఆమె నాలుగు ప్రశ్నలు అడిగింది.

"బాబాజీ, సత్యదర్శనం ఎలా అవుతుంది?" అంది చివరిగా హఠాత్తుగా ఆయన పెద్దగా నవ్వేరు.

"అసలీ సత్యదర్శనం ఏటమ్మా? అయన్నీ సరిగ్గా తెలీవమ్మా వీడికి. దేవుణ్ని నమ్ముకోండర్రా అంటాను. నిన్ను తెలుసుకో తల్లీ అంటాను. మా రత్నం తల్లిగారు చెప్పినట్టు నాకే ఇంగ్లీషు పుస్తకాలూ తెలీవమ్మా."

ఆమె ఇబ్బందిగానూ ఆయన హాయిగానూ నవ్వేరు. తరవాత భోజనాలు అయింతరవాత కూడారత్నం ఏవో పనులు పురమాయిస్తూ హడావుడిగా ఉంది. బాబా గారి పక్క గదిలోనే నిర్మలకి మంచం వేయించారాయన. తలుపు దగ్గిరిగా వేసుకుని నడుం వాల్చిందామె. ఎదురుగా గోడమీద పెద్ద కృష్ణుడి బొమ్మ వేలాడుతోంది. ఆశ్రమంలో ఎక్కడా పుస్తకాలు లేవు. బాబాగారి జీవిత చరిత్ర పుస్తకం, దిన పత్రిక తప్ప ఎక్కడా ఏ పుస్తకాలూ లేవు.ఆమె ఆలోచనల దారపుండలో ఉండిపోయి బాబాగారు రావడం చూడలేదు. మంచం పక్క నిలబడగానే ఆమె చటుక్కున లేచి కూచుంది.

"నిద్ర రావడం లేదా అమ్మా?"అంటూ ఆయన జేబులోంచి తెల్లదారం తీసి ఆమె

ముంజేతికి కట్టేరు. మెత్తటి ఆయన హస్తస్పర్శ పసిపిల్ల చేతుల్లా ఉంది. ఆమెకేం మాట్లాడాలో తోచక నమస్కరించి ఆయన వేపు చూసింది. ఆయన కళ్లలో గొప్పదయ, ప్రేమ, ఆశ్చర్యకరమైన శాంతి కనిపించేయి. మొట్టమొదటిసారిగా ఆమెకి బుద్ధితో సంబంధం లేని ఒక అస్పష్టమైన ఆత్మీయత ఏర్పడింది మనసులో.

"పడుకోండమ్మా, మంచి నిద్ర పడుతుంది." అంటూ బాబాగారు ఆమె తల మీద చెయ్యి పెట్టేరు. క్షణంలో ఆమె రక్తమాంసాలు, నరాలు, రక్తనాళాలు అల్లకల్లోలం అయిపోయాయి. తలభాగం నుంచీ తన శరీరం ఇముడ్చుకోలేని మహాసముద్రం పొంగినట్టయింది. ఒక్కక్షణంలో అంత అలజడీ ఉపశమించింది. సముద్రగర్భపు నిర్మల శాంతి ఆవహించిందామెని దానితోపాటుగా తనెన్నడూ ఊహించలేని గొప్ప దుఖం ఆమె పేగుల్ని తెంచుకుంటూ ఎగిసి పడింది. రెండు జన్మలకి చాలినంత కన్నీరు కార్చిందామె. వెక్కి వెక్కి ఆమెలో ఊరుతున్న దుఃఖ తరంగాల్ని స్రవిస్తోంది నిర్మల. బాబాగారు మరోసారి తల మీద చెయ్యివేసి వెళ్లిపోయారు.

ఆమెకి మెళకువ వచ్చేసరికి తెల్లారిపోయింది. దిండు వర్షంలో తడిసినట్టయి పోయింది. దిండుపక్కన మెరుస్తోన్న కళ్లతో కృష్ణాజీ ఆమెను చూస్తున్నాడు. లేచి కూచుందామె. తెలిగ్గా ప్రశాంతంగా సముద్రం మీద లేచే మబ్బుతునకలా ఉంది నిర్మల. తన ఉనికి తెలీడానికి కొన్ని క్షణాలు పట్టింది.

బాబాగారు దూరంగా ఉన్న మొండిగోడ మీద కూచుని లేగదూడని చూస్తున్నారు. పచ్చిక మీంచి నడుచుకుంటూ ఆయన్ని సమీపించింది నిర్మల.

"అమ్మా బాగా నిద్ర పట్టిందా?"

ఆయన ముందు నుంచుందామె. నవ్వుతున్నా రాయన. కళ్లలో నీళ్లు తిరిగేయామెకి. కన్నీరు నిండిన గొంతుతో "నాన్నగారూ" అందామె. ఒంగి ఆయన పాదాలు స్పృశించి లేచిందామె. ఆమె రెండుచేతులా పట్టుకుని అడిగే రాయన.

"ఇడ్లీలు తింటారా అమ్మా. మా రాజు బాగావేస్తాడు. రండి"

వారం రోజుల తరవాత హాయిగా ధ్యానం చేసుకుని లేవగానే బోస్టన్ నుంచి ఫోను మోగింది.

"అమ్మా. ఇపుడే పిన్ని చెప్పింది. ఎవరో బాబాగారి దగ్గిర సమ్మరంతా ఉంటావని చెప్తోంది."

"అవున్నా. బాబాగారి దగ్గిర. తరవాత వస్తాలే."

❖ ❖ ❖